క్లుప్తంగా

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎంవో కృష్ణవేణి

రణస్థలం: ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్, పదో తరగతిల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర ఆదర్శ పాఠశాల అకడమిక్ మోనటరింగ్ అధికారి కృష్ణవేణి తెలిపారు. రణస్థలం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. జేఈఈ, నీట్ వంటి ఆన్‌లైన్ తరగతులపై విద్యార్థులకు ఉన్న ఆసక్తిని గమనించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా మహాలక్ష్మి


మహాలక్ష్మీ అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో ఉన్న భూ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాలక్ష్మీ దేవిని శ్రావణ మాసం సందర్భంగా గురువారం శాకంబరిగా అలంకరించారు. అర్చకులు చామర్తి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న కృష్ణుడి వేషధారణ


వేషధారణలో చిన్నారులు

జి.సిగడాం: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పెంట, సంతవురిటి గ్రామాల్లో గురువారం చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుడి లీలలతో సందడి చేశారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. విద్యార్థులకు ఇంటర్మీడియెట్, పోటీ పరీక్షల పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.చిట్టిబాబు, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగోజీ, డాక్టర్ రమణమూర్తినాయుడు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి బి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు


బాతువ పాఠశాలలో క్రీడాపోటీలు

జి.సిగడాం : జెండా పండగ సందర్భంగా గురువారం పాఠశాలల్లో క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలకు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేయనున్నారు. బాతువ ఎంపీపీ పాఠశాలలో జరిగిన పోటీలను హెచ్ఎం ఎస్.వి.ఆర్, మొయ్యి జనార్దనరావు పర్యవేక్షించారు.

వేడుకలకు ముస్తాబు


సిద్ధమవుతున్న శకటాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా శుక్రవారం జరగనున్న స్వాతంత్ర్య వేడుకలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. వీఐపీలు, వీవీఐపీలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలు, వీక్షకుల కోసం గ్యాలరీలు సిద్ధం చేశారు. వివిధ శాఖల ప్రగతిని ప్రదర్శించే శకటాలు తయారు చేశారు.

జెండా ఎగరేద్దాం..
నియమాలు పాటిద్దాం



- జాతీయ పతాకాన్ని ఎగరేసేటప్పుడు నిబంధనలు తప్పనిసరి
- ఫ్లాగ్ కోడ్ పాటించడం మన బాధ్యత

శ్రీకాకుళం న్యూకాలనీ: స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధమైంది. బడి, గుడి, వీధి, ఆఫీసు, సంస్థ ఇలా తారతమ్యం లేకుండా ఆగస్టు 15న(నేడు) జాతీయ జెండాను ఎగురవేసేందుకు అందరూ సమాయత్తమయ్యారు. హర్‌ఘర్ తిరంగా పేరిట దేశ ప్రజలంతా త్రివర్ణ పతాకంలో భాగస్వాములు కావాలని దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో ప్రొఫైల్ పిక్చర్‌గా త్రివర్ణ పతాకాలు సందడి చేస్తున్నాయి. అయితే జాతీయ జెండాను ఎగురవేయడానికి కొన్ని నియమాలు ఉన్నాయి.

ఫ్లాగ్ కోడ్ అంటే?

జాతీయ జెండాను ఎగురవేయడానికి ప్రతి ఒక్కరూ ఫ్లాగ్ కోడ్ 2002ను అనుసరించాల్సి ఉంది. యాంటీ డిఫమేషన్ ఆఫ్ నేషనల్ సింబల్స్ యాక్ట్–1971 నిబంధనలను కూడా పాటించాల్సి ఉంటుంది. ఈ కోడ్‌లోని నిబంధన 2.1 ప్రకారం, జాతీయ జెండా పట్ల పూర్తి గౌరవంతో సాధారణ పౌరులు ఏ ప్రదేశంలోనైనా జెండాను ఎగురవేయవచ్చు. దీనిపై ఎలాంటి నిషేధం లేదు. అయితే, జాతీయ జెండాను అవమానిస్తే మొదటి తప్పుకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే నిబంధన ఉంది. 2002 జనవరి 26న కొత్త కోడ్ అమల్లోకి వచ్చింది. అంతకుముందు నేషనల్ సింబల్స్ అండ్ నేమ్స్ యాక్ట్–1950, యాంటీ డిఫమేషన్ ఆఫ్ నేషనల్ సింబల్స్ యాక్ట్–1971 ఉండేవి. ఇటీవల ఈ కోడ్‌లో రెండు ప్రధాన మార్పులు చేశారు.

మారిన నిబంధనలివే..

2022 జూలై 20న చేసిన సవరణ ప్రకారం, ఇప్పుడు జాతీయ జెండాను పగలు, రాత్రి కూడా ఎగురవేయవచ్చు. అది బహిరంగ ప్రదేశమైనా, ఇంటి మీదైనా ఎగరేయడానికి అనుమతి ఉంది. అంతకు ముందు జాతీయ జెండాను సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు మాత్రమే ఎగురవేయడానికి అనుమతి ఉండేది. జాతీయ జెండాను పాలిస్టర్ ఫాబ్రిక్‌తో తయారు చేయడానికి 2021 డిసెంబర్ 30 నుంచి అనుమతించారు. గతంలో ఖాదీ వస్త్రంతో మాత్రమే జాతీయ జెండా తయారీకి అనుమతి ఉండేది.

ఈ విషయాలు మరువద్దు..

- ప్రభుత్వ ఫ్లాగ్ కోడ్ గతంలో చాలా కఠినంగా ఉండేది. ఇప్పుడు దానిని సరళీకృతం చేశారు. అయినా సరే, జాతీయ జెండాను ఎగురవేసేటప్పుడు తప్పనిసరిగా కొన్ని నియమాలు, పద్ధతులు గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం.
- జెండాను ఎగరేసేటప్పుడు అది చిరిగిపోయి ఉండకూడదు. నలిగిపోయిన, తిరగబడిన జెండాను ఎగరవేయరాదు. సరైన స్థలంలోనే జెండా ఎగరేయాలి.
- పతాకాన్ని ఎగరేసే ఎత్తులో లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో మరే ఇతర జెండా ఎగురవేయకూడదు.
- జెండాను ఎలాంటి అలంకరణకు ఉపయోగించకూడదు.
- ఎగురవేసేటప్పుడు, కాషాయ రంగు పైకి ఉండేలా జాగ్రత్త వహించాలి.
- జెండాపై ఏమీ రాయకూడదు. ఏ వస్తువుపై కప్పడానికి జెండాను ఉపయోగించకూడదు.
- జెండాను ఎగురవేయడానికి సిద్ధం చేస్తున్నప్పుడు అవసరమైతే కొన్ని పువ్వులు అందులో ఉంచవచ్చు.
- జాతీయ జెండా నేల మీద పడేయకూడదు, నీటిపై తేలనీయకూడదు.
- జెండాను దుస్తులుగా కుట్టించుకోకూడదు. నడుము కింది భాగంలో చుట్టుకోకూడదు. రుమాలుగా వాడకూడదు

గాజుల చేతుల గర్జన


జెండా బంగారమ్మ



శ్రీకాకుళం కల్చరల్: ఝాన్సీ లక్ష్మీబాయితో మొదలైన స్వాతంత్ర్య ఉద్యమం ఆనక అనేక మలుపులు తీసుకుంది. అన్ని దశల్లోనూ అతివలు తమ వంతు పాత్ర పోషించారు. జిల్లాకు చెందిన మహిళలు కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు.

- బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నింగికెగిసిన పోరాటంలో భాగంగా విదేశీ వస్త్రాలయాల వద్ద పికెటింగ్ జరిపిన ఘటనలో నరసన్నపేటకు చెందిన టంకాల సుందరమ్మను పోలీసులు అరెస్టు చేశారు. హరిజనోద్యమంలో పాల్గొన్న అన్నపూర్ణమ్మ ఉద్యోగం కోల్పోయారు. నాలుగు నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించారు.
- విదేశీ వస్త్రాలు, మద్యపాన నిషేధ ఉద్యమంలో పాల్గొన్న శ్రీకాకుళానికి చెందిన కప్పగంతుల ఆదిలక్ష్మి, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న మాణిక్యపురానికి చెందిన సుభద్రా బెహరాణి, కర్రి కనకమ్మ, గూడిన వరలక్ష్మీ, పాలతీర్థపు అడివమ్మ ఏడాది శిక్షను అనుభవించారు.
- గొర్లె పున్నమ్మ (మందస), మహంతి శేషమ్మ (మణిపురం), కె.మహాలక్ష్మమ్మ(పాలకొండ), కంచాడ వెంకమ్మ(కాశిబుగ్గ), జయంతి సూరమ్మ(టెక్కలి), యలాజి సూరమ్మ(బరంపురం), మరుగంటి వేంకటరమణమ్మ(బొబ్బిలి) తదితరులు శిక్షను అనుభవించిన వారిలో ఉన్నారు.
- మాజీ రాష్ట్రపతి వీవీ గిరి సోదరి అదుర్తి లక్ష్మీబాయి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించారు. సారాయి కొట్ల వద్ద, విదేశీ వస్త్రాల దుకాణాల వద్ద పికెటింగ్ చేస్తూ నాటి గంజాం జిల్లాలో పర్యటించి జైలు శిక్షను అనుభవించారు.
- జమిందారీ కుటుంబానికి చెందిన మంత్రిప్రగడ బంగారమ్మ 1932లో ఉప్పు ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. జెండా బంగారమ్మగా ప్రసిద్ధి పొందిన ఆమె బరంపురం నుంచి విజయవాడ వరకు జరిగిన పాదయాత్రలో పాల్గొన్నారు. సమరయోధులను ఆదరించారనే నెపంతో పర్లాకిమిడికి చెందిన పోకల తాయారమ్మను నెల్లూరు, కన్నూరు జైళ్లలో శిక్షించారు.
- 1930 ఏప్రిల్ 19న నౌపడలో ఉప్పుకుప్పల దోపిడీకి వెళ్లిన ఉద్యమ కారులకు భోజనాలు పెట్టి, పోలీసులకు నిరాకరించిన పురాణం వేణమ్మ ఉద్యమానికి నైతిక స్థైర్యాన్ని అందించారు. పోలీసు దుస్తులు విడిచి సాధారణ దుస్తుల్లో వచ్చాకే వారికి భోజనాలు పెట్టారు.
- ఇక వీర గున్నమ్మ చరిత్ర చిరస్థాయిగా నిలిచిపోయింది. మందస మండలం గుడారి రాజమణిపురానికి చెందిన సాసుమాను గున్నమ్మ మందస జమిందార్‌తోపాటు పోలీసులను ఎదురించి వీర మరణం పొందారు. పోరాడే సమయంలో ఆమె గర్భవతి. మందస ఎస్టేట్‌లో రైతుల ఆందోళనలో పాల్గొన్న అంపోలు కన్నమ్మకు ఏడాది జైలు శిక్ష విధించారు.

ఘనంగా జన్మాష్టమి వేడుకలు


నృత్యప్రదర్శన చేస్తున్న శివ నృత్య కళా నిలయం సభ్యులు

రణస్థలం: కోష్ట సమీపంలోని శ్రీ కృష్ణ చైతన్య మఠం గోసేవా ఆశ్రమంలో జన్మాష్టమి వేడుకలు కొనసాగుతున్నాయి. పదో రోజు కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళంకు చెందిన శ్రీ శివ నృత్య కళానిలయం బృందం కూడిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. అనంతరం హరినామ కీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యాప్‌లోనే పొదుపు సంఘాల వివరాలు


శిక్షణ పొందుతున్న సభ్యులు

రణస్థలం: పొదుపు సంఘాల్లో జమ చేసిన, వాడుకున్న డబ్బుల వివరాలు ప్రతిఒక్క సభ్యురాలికి తెలియాలంటే యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఆర్‌డీఏ డీపీఎం ఐ.బి.మోహన్‌రావు తెలిపారు. లావేరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎండీఎంఎల్ (మన డబ్బులు–మన లెక్కలు) ఈ–నారీపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం శక్తి సంఘాలకు సంబంధించి ప్రతి నెలా తప్పనిసరిగా సమావేశమై ఆర్థిక లావాదేవిలపై చర్చించుకుని తీర్మానం చేసుకోవాలని సూచించారు. ఆ తీర్మానాలు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. లావేరు మండలంలో 1844 సంఘాల్లో 19,539 మంది సభ్యులు యాప్ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలత, బి.వి.సుబ్బయ్య నాయుడు, ఎల్‌సీ నాగరాజు, మండల సమాఖ్య అధ్యక్షులు ఎల్.కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు స్వాతంత్ర్య కళ


జెండాలు, త్రివర్ణ వస్తువులు


బ్యాడ్జీలు


జెండాలు

స్వాతంత్ర్య దినోత్సవం, జిల్లా 75వ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మార్కెట్లు కళకళలాడాయి. మువ్వన్నెల జెండాలు, త్రివర్ణ బ్యాండ్‌లు, పూల దండలు, బ్యాడ్జిలు ఎక్కువగా లభించే పెట్రో మ్యాక్స్ వీధిలో పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరిగాయి. జెండాలు సైజు బట్టి రూ.50 నుంచి రూ.200 వరకు విక్రయించారు.

– శ్రీకాకుళం కల్చరల్

కదం తొక్కిన బాతువ రైతులు

- పీఏసీఎస్ చైర్మన్ పదవి తమ గ్రామానికే కేటాయించాలని డిమాండ్
- కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ కార్యాలయం వద్ద ధర్నా


ర్యాలీ నిర్వహిస్తున్న బాతువ రైతులు, గ్రామస్తులు

జి.సిగడాం:

బాతువ గ్రామ రైతులు, యువత రోడ్డెక్కారు. పీఏసీఎస్ చైర్మన్ పదవిని పొరుగు గ్రామానికి చెందిన వ్యక్తికి కేటాయించడంపై నిరసన వ్యక్తం చేశారు. గురువారం గ్రామ రామ మందిరం నుంచి పీఏసీఎస్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. 30 ఏళ్లుగా సహకార సొసైటీలో అధ్యక్ష పదవిలో గ్రామానికి చెందే కొనసాగారని, కూటమి ప్రభుత్వం వచ్చాక గెడ్డకంచరాం గ్రామానికి పదవి కేటాయించడం తగదని, కుటుంబాల్లో చిచ్చుపెట్టి ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టారని మండిపడ్డారు. బాతువ గ్రామ రైతులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏసీఎస్ పరిధిలో బాతువ, సేతుభీమవరం, గెడ్డకంచరాం, గదబపేట ఉన్నాయని, వీటిలో బాతువలోనే 8 టీసీలు ఉన్నాయన్నారు. ఎక్కువ టీసీలు ఉన్న గ్రామమైన బాతువకే చైర్మన్ పదవి ఇవ్వకుండా నాలుగు టీసీలు ఉన్న గ్రామానికి కేటాయించడం అన్యాయమన్నారు. నిరసన కార్యక్రమంలో రైతులు బూటు అప్పారావు, పల్లేటి సన్యాసిరావు, కలిశెట్టి శాంతారావు, వావిలపల్లి సూర్యనారాయణ, ముల్లు సన్యాసిరావు, ముల్లు సూర్యనారాయణ, ముల్లు పాపినాయుడు, కలిశెట్టి అన్నంనాయుడు, జమ్ము ఉత్తరనాయుడు మీసాల కృష్ణారావు, కూనిబిల్లి అప్పలనాయుడు , మీసాల కన్నంనాయుడు, శాసపు కామేశ్వరరావు, పైల సత్యం, కూనిబిల్లి మహంకాళి, ముల్లు తాతంనాయుడు, వెంకటేష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అన్యాయం



బాతువ పీఏసీఎస్ రైతులకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. 30 ఏళ్ల సంప్రదాయాన్ని విస్మరిస్తూ చైర్మన్ పదవిని గెడ్డకంచరాంకు ఇవ్వడం దారుణం.

– బూటు అప్పారావు, రైతు, బాతువ

నిబంధనలకు విరుద్ధం..



బాతువలో 8 టీసీలు ఉన్నాయి. ఇతర గ్రామాలకు 4 టీసీలు ఉన్నాయి. ఎక్కువ టీసీలు ఉన్న గ్రామమైన బాతువకే చైర్మన్ పదవి కేటాయించకుండా వేరే గ్రామానికి ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం.

– పల్లేటి సన్యాసిరావు, రైతు, బాతువ

పోరాటాలు చేస్తాం



మా గ్రామానికి చైర్మన్ పదవి ఇవ్వకుండా వేరే గ్రామానికి కేటాయించడం తగదు. మాకు జరిగిన అన్యాయంపై పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం. కూటమి ప్రభుత్వం తీరు సరికాదు.

– కలిశెట్టి శాంతారావు, రైతు, బాతువ

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల తిరంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు, వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) క్యాంపస్ యూనిట్లు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ గురువారం నిర్వహించారు. దేశభక్తి, స్వాతంత్ర్య సమరస్ఫూర్తి, జాతీయ సమైక్యతల నినాదాలతో వర్సిటీలో మువ్వెన్నల జెండాలను రెపరెపలాడించారు. ప్రతి భారతీయుడు ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగరవేయాలని నినదించారు. ఆజాద్ అమృత మహోత్సవంలో ప్రతీ ఒక్కరం భాగస్వామ్యం అవుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, ఎన్.ఎస్.ఎస్ పీవోలు డాక్టర్ డి.తాతారావు, టి.భవానీ, బి.వ్యాసగీత, ఏ.గణేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు సాధన


కవాతు ప్రక్రియను తిలకిస్తున్న ఎస్పీ, జేసీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో పంద్రాగస్టు వేడుకల నేపథ్యంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సారథ్యంలోని జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా గురువారం సాయుధ పోలీసు బలగాలు నిర్వహించిన కవాతు సాధనను ఎస్పీ పర్యవేక్షించారు. ఏఆర్ డీఎస్పీ శేషాద్రి పెరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన ఈ ప్రక్రియలో ఎస్పీ గౌరవవందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజకీయ అతిథులు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అధికారులు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించే వివిధ విద్యాసంస్థల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీ వివేకానంద, సీఐ పి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన 14వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు గురువారం ర్యాలీ నిర్వహించారు. కళాశాల పరిసరాల్లో హర్ ఘర్ తిరంగా పేరిట నిర్వహించిన ఈ ర్యాలీని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు మాట్లాడుతూ దేశ ఐక్యతను, జాతీయ భావాన్ని పెంపొందింపజేయడంలో ఎన్‌సీసీ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలోఎన్‌సీసీ అధికారి కెప్టెన్ వై.పోలినాయుడు, క్యాడెట్లు పాల్గొన్నారు.